జేసీ డైరెక్షన్.. మూక ఓవరాక్షన్

- రెండు రోజుల క్రితం మున్సిపల్ కార్యాలయంలోని కమిషనర్ చాంబర్‌లోకి చొరబడిన టీడీపీ కౌన్సిలర్లు అక్కడున్న వర్క్ ఇన్‌స్పెక్టర్ జేసీ సూర్యనారాయణరెడ్డిని టార్గెట్ చేస్తూ కమిషనర్ రవితో వాగ్వావాదానికి దిగారు. ఆయన విధులకు ఆటంకం కల్గించారు. కమిషనర్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో టీడీపీ కౌన్సిలర్లపై పోలీసులు కేసు నమోదు చేశారు.
- గతంలో ప్రొటోకాల్ వివాదంతో మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి, అతని అనుచర గణం మూడు రోజుల పాటు మున్సిపల్ కార్యాలయంలోనే తిష్టవేశారు. వంట వార్పు పేరిట ఉద్యోగుల విధులకు ఆటంకం కల్గించారు. కమిషనర్‌ను తన చాంబర్‌లోకి వెళ్లకుండా చేసిన జేసీ తీరుపై పట్టణ ప్రజలు విమర్శలు గుప్పించారు.

- కమిషనర్ చాంబర్‌లోకి చొచ్చుకొస్తున్న టీడీపీ కౌన్సిలర్లు
- ఉద్యోగుల విధులకు ఆటంకం
- చైర్మన్ జేసీ ఆదేశాలతో రచ్చ చేస్తున్న వైనం



తాడిపత్రి అర్బన్: ఆవు చేను మేస్తే దూడ గట్టున మేస్తుందా అన్నట్లుంది తాడిపత్రి తెలుగుదేశం పార్టీ కౌన్సిలర్ల తీరు. నిత్యం అధికారులపై తప్పుడు కేసులు బనాయిస్తూ వారిని బ్లాక్‌మెయిల్ చేస్తున్న జేసీ ప్రభాకర్‌రెడ్డిని ఆదర్శంగా తీసుకున్నారు. ఏకంగా కమిషనర్‌పై తప్పుడు కేసులు బనాయించేందుకు సిద్ధమయ్యారు. ఓట్లేసి గెలిపించిన ప్రజలకు అందుబాటులో ఉండకుండా రోజూ కార్యాలయంలో తిష్టవేస్తూ ఉద్యోగుల విధులకు ఆటంకం కల్గిస్తూ వారిని మానసిక వేదనకు గురి చేస్తున్నారు. ఏదో ఒక సాకుతో రచ్చ చేస్తున్నారు. సంబంధం లేని విషయాల్లో జోక్యం చేసుకుంటూ ఉద్యోగుల విధులకు ఆటంకం కల్గిస్తున్నారు.

మారని జేసీ..

ప్రజల్లో రోజురోజుకు ప్రాభవం కోల్పోతుండడంతో తన ఉనికిని చాటుకునేందుకు మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి నానా తంటాలు పడుతున్నాడు. కనుసైగలతో, హావ భావాలతో అధికారులను గుప్పిట్లో పెట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నాడు. తాడిపత్రికి కొత్త అధికారి వస్తే చాలు బెంబేలెత్తిస్తూ తన చెప్పు చేతల్లోకి తీసుకునేందుకు యత్నిస్తున్నాడు. గత ఏడాది ఆగస్టులో తాను పిలిస్తే రాలేదన్న అక్కసుతో తన అనుచరులతో కలిసి మున్సిపల్ కార్యాలయంలో 24 గంటల పాటు తిష్ట వేసి నానా హంగామా సృష్టించాడు. సిబ్బందికి నోటీసులు ఇస్తానంటూ హడావుడి చేశాడు. ఈ ఏడాది జనవరి 26న రిపబ్లిక్ డే సందర్భంగా జెండా ఆవిష్కరణ పేరుతో నానా యాగి చేసి విమర్శల పాలయ్యాడు. మున్సిపల్ చైర్మన్ హోదా అడ్డుపెట్టుకుని ఇష్టారీతిన వ్యవరిస్తున్నాడు. నిబంధనలకు విరుద్ధంగా ఏ మున్సిపాలిటీలో లేని విధంగా రెండు చాంబర్లను ఆక్రమించుకున్నాడు. అధికారుల వద్ద ఉండాల్సిన తాళాలను కూడా తన వద్దనే ఉంచుకుంటున్నాడు.

అభివృద్ధికి ఆటంకం..

బయటి వ్యక్తులు చాంబర్లోకి వచ్చి ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని మున్సిపల్ సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జేసీ అనుచరులు కొందరు నిత్యం కార్యాలయాల్లోనే తిష్టవేసి కార్యకలాపాలకు అడ్డుతగులుతున్నట్లు వాపోతున్నారు. జేసీ విపరీత పోకడలను తాళలేని సిబ్బంది మూకుమ్మడిగా సెలవుపై వెళ్లాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. జేసీ ప్రభాకర్‌రెడ్డి, తెదేపా కౌన్సిలర్లు, అనుచరుల వైఖరితో మున్సిపల్ విధులకు ఆటంకం కలగడమే కాకుండా పట్టణాభివృద్ధిపై ప్రతికూల ప్రభావం పడే అవకాశముంది.

పేదల పక్షపాతి సీఎం జగనన్న


సమస్యలను తెలుసుకుంటున్న కేతిరెడ్డి హర్షవర్ధన్ రెడ్డి

పెద్దపప్పూరు: పేదల పక్షపాతిగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్నారని తాడిపత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి తనయులు యువనాయకులు కేతిరెడ్డి హర్షవర్ధన్ రెడ్డి, సాయిప్రతాప్ రెడ్డి అన్నారు. మంగళవారం పెద్దపప్పూరు మండలంలోని పెద్దయక్కలూరు గ్రామంలో పర్యటించి ప్రజల సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. వారు మాట్లాడుతూ నాలుగున్నరేళ్ల కాలంలో ఎటువంటి రాజకీయ,కుల,మత భేదాలు లేకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను వర్తింపజేశారన్నారు. సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకుపోయి పరిష్కారానికి తప్పక కృషి చేస్తామని భరోసా ఇచ్చారు. మరోమారు జగనన్నను 2024 ఎన్నికల్లో గెలిపించాలని గ్రామస్తులను కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ వెంకటరామిరెడ్డి (రామయ్య), వైస్‌ఎంపీపీ పప్పూక కళావతి, కోఆప్షన్ సభ్యుడు హాజీవలి, సీనియర్ నాయకులు వరదాయపల్లి శివారెడ్డి, ముచ్చుకోట అమర్‌నాథ రెడ్డి,చిక్కేపల్లి శ్రీనివాసరెడ్డి, నామనాంకపల్లి రఘునాథ రెడ్డి, స్థానిక నేతలు శంకర్ రెడ్డి,నాగేంద్ర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలతో పేదల అభ్యున్నతి

తాడిపత్రి అర్బన్: సంక్షేమ పథకాలతోనే పేదల అభ్యున్నతి సాధ్యమని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి తనయుడు, యువ నాయకుడు కేతిరెడ్డి హర్షవర్ధన్ రెడ్డి అన్నారు. మంగళవారం 27వ వార్డు సచివాలయం పరిధిలోని విజయనగర్ కాలనీలో ఆయన పర్యటించారు. ప్రతి ఇంటి వద్దకు వెళ్లి సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వం ద్వారా ప్రతి కుటుంబానికి అందిస్తున్న సంక్షేమ పథకాలు వచ్చాయా లేదా అని అడిగి తెలుసుకొన్నారు. సంక్షేమ పథకాల ద్వారా వారు పొందిన లబ్ధిని ప్రజలకు వివరిస్తూ అలాగే ప్రజలకు ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ రంగనాథ్‌రెడ్డి, నాయకులు రామలక్ష్మిరెడ్డి, ప్రదీప్, విజయభాస్కర్, ఓబులేసురెడ్డి, రామచంద్ర, తదితరులు పాల్గొన్నారు.

సంతాపం

పెద్దవడుగూరు: మండల పరిధిలోని ఏ.తిమ్మాపురం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు సీతప్ప అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న తాడిపత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి కుమారుడు కేతిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి కార్యకర్తలతో గ్రామానికి వెళ్లి మంగళవారం బాధిత కుటుంబాన్ని ఓదార్చారు. పార్థివ దేహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని అన్ని విధాలుగా ఆదుకొంటామన్నారు.

క్రీడాపోటీలు భవిష్యత్‌కు ఉపయుక్తం

- తహసీల్దార్ రమాదేవి


సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ రమాదేవి

బుక్కరాయసముద్రం: క్రీడా పోటీలు విద్యార్థుల భవిష్యత్తులో ఎంతో ఉపయోగ పడతాయని తహసీల్దార్ రమాదేవి పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్ క్రీడా మైదానంలో స్కూల్ గేమ్ ఫెడరేషన్ నియోజకవర్గం స్థాయి అండర్–14, అండర్ –17 బాల బాలికల పోటీలు, ఎంపికల ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తహసీల్దార్ రమాదేవి హాజరై మాట్లాడారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలన్నారు. గ్రామీణ క్రీడా కారులకు ప్రోత్సాహం అందిస్తే వారు మరింతగా అభివృద్ధి సాధిస్తారన్నారు. విద్యార్థులకు చదువులతో పాటు క్రీడా పోటీలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయన్నారు. పీడీ గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ ఈ క్రీడా పోటీల్లో రెండు రోజుల పాటు కబడ్డీ, ఖోఖో వాలీబాల్, త్రోబాల్, బాల్ బాడ్మింటన్, బాడ్మింటన్, టెన్నీ కాయిట్, యోగా, అండర్–14,17 బాల బాలికల 1100 మంది క్రీడా కారులు పాల్గొన్నారన్నారు. కార్యక్రమంలో సీఐ నాగార్జున రెడ్డి, ఎంఈఓ లింగానాయక్, శ్రీరాములు నాయక్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వసుంధర, పీడీలు గోపాల్‌రెడ్డి, శ్రీనివాసులు, ఏపీఎస్‌ఏపీఈ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు కేశవమూర్తి, గోపాల్‌రెడ్డి విద్యార్థులు పాల్గొన్నారు.

చాకలి ఐలమ్మ ఆదర్శప్రాయులు


ఐలమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

తాడిపత్రి అర్బన్: తెలంగాణ సాయుధ పోరాట కాలంలో చిట్యాల చాకలి ఐటమ్మ ప్రదర్శించిన తెగువ, చైతన్యం నేటి తరానికి ఆదర్శప్రాయమని సీపీఐ నాయకులు కొనియాడారు. చాకలి ఐలమ్మ 128వ జయంతి వేడుకలను మంగళవారం స్థానిక యల్లనూరు రోడ్డులోని చల్లా సుబ్బరాయుడు సర్కిల్‌లో ఘనంగా నిర్వహించారు. చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆ పార్టీ పట్టణ కార్యదర్శి చిరంజీవియాదవ్ మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాటంలో విప్లవాగ్నిగా నిలిచి నిజాం రజాకార్లను, దేశ్‌ముఖ్‌లను ఎదుర్కొని వారి గుండెల్లో వణుకు పుట్టించిన వీరవనిత అన్నారు. కార్యక్రమంలో సహాయ కార్యదర్శి శ్రీరాములు, నాయకులు రామాంజి, నాగేంద్ర, రత్నమయ్య, రమణయ్య, రజయ సంఘం నాయకులు పాల్గొన్నారు.

'హుండీ' దొంగను త్వరలో పట్టుకుంటాం


మాట్లాడుతున్న సీఐ మహేశ్వరరెడ్డి

గుంతకల్లు రూరల్: ప్రముఖ పుణ్యక్షేత్రం కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానంలో హుండీలోని నగదు చోరీ చేసిన ఆలయ చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ కృష్ణారెడ్డిని త్వరలోనే పట్టుకుంటామని రూరల్ సీఐ మహేశ్వరరెడ్డి తెలిపారు. మంగళవారం స్థానిక కసాపురం పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ గోపాలుడుతో కలసి ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తాను సీఎంఓ డ్యూటీలో ఉండటం, ఎస్ఐ తిరుమల బ్రహ్మోత్సవాల్లో ఉండటం మూలంగా పరారీలో ఉన్న హుండీ దొంగ కృష్ణారెడ్డిని పట్టుకోవడం ఆలస్యమైందన్నారు. దొంగను పట్టుకోవడం కోసం మూడు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి బళ్లారి, పుట్టపర్తి, విజయవాడ తదితర ప్రాంతాలకు పంపామన్నారు. అంతేకాకుండా అతడి కుటుంబ సభ్యులు, అత్యంత సన్నిహితంగా ఉండే వ్యక్తులను విచారించడంతోపాటు వారిమీద నిఘా ఉంచామన్నారు. ఈ కేసులో పూర్తి స్థాయి విచారణ చేసి చోరీ వెనక ఎవరున్నా ఎంత మంది ఉన్నా ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించే ప్రసక్తే లేదని హెచ్చరించారు. ఆలయంలో ఉండే 64 సీసీ కెమెరాలకు సంబంధించిన ఫుటేజీలను తీసుకొని పరిశీలన చేపట్టామన్నారు. అలాగే ఆలయ పవిత్రత, భక్తుల మనోభావాలు దెబ్బతినేలా సోషల్ మీడియాలో పోస్టులు పెట్టే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

బుక్కరాయసముద్రం: గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు వ్యక్తిగత పరిశుభ్రతతోపాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మండల వైద్యాధికారిణి స్వాతిలక్ష్మి తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలోని దక్షిణామూర్తినగర్ కాలనీలో ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమంలో భాగంగా ప్రజలకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ స్వాతి లక్ష్మి మాట్లాడుతూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. మంచి ఆహారం క్రమం తప్పకుండా తీసుకోవాలన్నారు. ఇళ్ల పరిసరాల్లో మురుగు గుంటలు లేకుండా చూసుకోవాలన్నారు. అనంతరం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో నిర్వహిస్తున్న సర్వేను పరిశీలించారు. దీర్ఘకాలిక రోగులకు రక్తపోటు, డయాబెటీస్, అస్తమా హిమోగ్లోబిన్ పరీక్షలు చేస్తున్నారా? లేదా అని అడిగి తెలుసుకున్నారు. గర్భిణులకు ప్రత్యేక వైద్య పరీక్షలు చేయాలన్నారు. కార్యక్రమంలో మీట్ లెవల్ హెల్త్ ప్రొవైడర్ జ్యోతి, హెల్త్ అసిస్టెంట్ ధనుంజయ, సచివాలయ ఆరోగ్య కార్యదర్శి బొజ్జమ్మ, ఆశా వర్కర్లు, వలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్యాలు పెంపొందించుకోండి


సిబ్బందికి సూచలిస్తున్న కమిషనర్ మల్లికార్జున, ఎంఈఈ గురప్ప

గుంతకల్లుటౌన్: పట్టణంలోని శ్రీసాయి వెంకటేశ్వర కళాశాలలో నాక్ (నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్) సంస్థ అందిస్తున్న ఉచిత శిక్షణ తరగతుల్లో నాన్ పీహెచ్ ఇంజనీరింగ్ సిబ్బంది పాల్గొని వృత్తి నైపుణ్యాలను పెంపొందించుకోవాలని మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున, ఎంఈఈ గురప్పయాదవ్ సూచించారు.మంగళవారం నాన్ పీహెచ్ వర్కర్స్ మస్టర్‌ను కమిషనర్ పరిశీలించారు. వారు మాట్లాడుతూ మున్సిపాలిటీలో ఫిట్టర్, ఎలక్ట్రికల్, వాటర్ వర్క్స్ విభాగాల్లో పనిచేసే సిబ్బంది నాక్ ట్రైనింగ్ క్లాసులను వినియోగించుకుని నైపుణ్యాలు, మెలకువలను పెంపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో డీఈ రామ్మూర్తి, ఏఈ హరిక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

4 లక్షల చేప పిల్లలు మృతి

గార్లదిన్నె: నీరు కలుషితం కావడంతో గార్లదిన్నె మండలం జంబులదిన్నె గ్రామ చెరువులో4 లక్షల చేప పిల్లలు మృతిచెందాయి. జంబులదిన్నె చెరువులో చెరువు సంఘం ఆధ్వర్యంలో 4 లక్షల చేప పిల్లలు పెంపకాన్ని చేపట్టారు. మంగళవారం ఉదయం చేపల వేటకు సంఘం సభ్యులు వెళ్లి చూడగా మృతిచెంది ఒడ్డున పడిన చేప పిల్లలు కనిపించాయి. దాదాపు రూ.4లక్షలు నష్టం వాటిల్లినట్లు సభ్యులు వాపోయారు.

బాల్య వివాహాలు చేస్తే కఠిన చర్యలు

- తహసీల్దార్ ఉషారాణి

గార్లదిన్నె: మండలంలో ఎవరైనా బాల్యవివాహాలు చేస్తే చర్యలు తప్పవని తహసీల్దార్ ఉషారాణి పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని మర్తాడులో 9వ తరగతి చదువుతున్న బాలికకు వివాహం చేస్తున్నట్లు ఐసీడీఎస్ అధికారులకు సమాచారం అందింది. దీంతో వారు పోలీసుల సహకారంతో బాల్య వివాహాన్ని అడ్డుకున్నారు. తహసీల్దార్ ఉషారాణి మాట్లాడుతూ బాల్య వివాహాలు చేయడం నేరమన్నారు. అలాగే బాల్య వివాహాల వల్ల జరిగే అనర్థాలను వివరించారు. అనంతరం బాలికకు, తల్లికి కౌన్సెలింగ్ చేసి, బాలికను బత్తలపల్లి చైల్డ్ హోంకు తరలించారు.

యల్లనూరులో చోరీ

యల్లనూరు: మండల కేంద్రంలోని కోలాటం చంద్రశేఖర్ ఇంట్లో చోరీ జరిగింది. దుండగులు ఇంటి తాళాలు ధ్వంసం చేసి ఇంట్లోకి ప్రవేశించి, 13 గ్రాముల బంగారం, రూ.20 వేల నగదును ఎత్తుకెళ్లినట్లు బాధితుడు చంద్రశేఖర్ యల్లనూరు ఇన్‌చార్జ్ ఎస్ఐ దిలీప్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

పామిడి: పట్టణంలోని భావసార క్షత్రియ కల్యాణ మంటపంలో మంగళవారం పామిడి లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత గుండె వైద్య శిబిరానికి అనూహ్య స్పందన లభించింది. శిబిరంలో కిమ్స్ సవీర ఆసుపత్రి గుండె వైద్య నిపుణుడు రామ్‌కుమార్, కీళ్ల వ్యాధి నిపుణుడు ప్రదీప్ 150 మందికి వైద్య పరీక్షలు చేశారు. క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు, ప్రభుత్వ ఆయూష్ సీనియర్ వైద్యాధికారి నల్లపాటి తిరుపతి నాయుడు, క్లబ్ అధ్యక్షురాలు డాక్టర్ శాంతిప్రియ, జిల్లా చైర్‌పర్సన్ డాక్టర్ మురళీకృష్ణ, ఉపాధ్యక్షుడు పీసీ జయరాంరావు, తదితరులు పాల్గొన్నారు.

సన్మానం

గార్లదిన్నె: పత్రి సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా ఎంపికైన చీమల శ్రీనివాసులును వైఎస్సార్‌సీపీ నాయకులు, అనంతపురం మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ నారాయణరెడ్డి మంగళవారం సన్మానించారు. ఆయన మాట్లాడుతూ పత్రి సంక్షేమ సంఘానికి కృషి చేయాలన్నారు. అనంతరం శ్రీనివాసులు, మెంబర్ పిల్లల శ్రీరామ్‌ను సన్మానించారు.

ప్రభుత్వ భూమి అన్యాక్రాంతం కానీయొద్దు

గుంతకల్లుటౌన్: పట్టణంలోని హనుమాన్ సర్కిల్‌లో 23 సెంట్ల ప్రభుత్వ స్థలం అన్యాక్రాంతం కాకుండా చర్యలు చేపట్టాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ పార్టీ డివిజన్ కార్యదర్శి బి.సురేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ఆ స్థలంలో చేపడుతున్న నిర్మాణ పనులను ఆ పార్టీ నాయకులు పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ అత్యంత విలువ చేసే ప్రభుత్వ స్థలం అన్యాక్రాంతమవుతున్నా రెవెన్యూ, మున్సిపల్, ఆర్‌అండ్‌బీ అధికారులు చోద్యం చూస్తున్నారన్నారు. నిర్మాణ పనులు జరుగుతున్న ఆ స్థలాన్ని అధికారులు వెంటనే స్వాధీనం చేసుకుని ప్రజాప్రయోజనాలకు వినియోగించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. లేని పక్షంలో ఆందోళన చేపడతామన్నారు. ఆ పార్టీ పట్టణ కార్యదర్శి జి.చిన్నా, నాయకులు ఉన్నారు.

28న కంటి శస్త్రచికిత్స శిబిరం

తాడిపత్రి అర్బన్: వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో ఈ నెల 28న గురువారం ఉచిత కంటి శస్త్ర చికిత్స శిబిరం నిర్వహిస్తున్నట్లు వాసవీ క్లబ్ అధ్యక్షుడు టి.చంద్రశేఖర్ మంగళవారం తెలిపారు. పట్టణంలోని ఆర్వీ స్వామి కళ్యాణమండపంలో బెంగళూరులోని శంకర కంటి ఆసుపత్రి వారిచే ఉచిత నేత్ర శస్త్ర చికిత్సలను నిర్వహించనున్నామన్నారు. గురువారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహించే శిబిరంలో కంటి పరీక్షలు, ఆపరేషన్లు ఉచితంగా చేయనున్నట్లు తెలిపారు. ఫోన్ నంబరు, ఆధార్ కార్డు, రేషన్ కార్డు ఒక్కొక్కటి 2 జిరాక్స్ కాపీలతో పాటు 2 ఫొటోలు తీసుకురావాలని కోరారు. 7013035235 నంబరుకు ఫోన్ చేయాలని కోరారు.

30 నుంచి 'జగనన్న ఆరోగ్య సురక్ష'

శింగనమల: మండలంలో ఈనెల 30 నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ నిర్మలాకుమారి తెలిపారు. ఈనెల 30న శింగనమల, అక్టోబర్ 3న సోదనపల్లి, 5న వెస్ట్ నరసాపురం, 7న ఆకులేడు, 10న సీ బండమీదపల్లి, 12న జూలకాల్వ, 17న ఆకులేడు –2, 19న రాచేపల్లి, 21న పెరవలి, 25న కల్లుమడి, 27న సలకంచెరువు, 31న ఉల్లికల్లు సచివాలయం పరిధిలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

క్లుప్తంగా

ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలి


కంటి పరీక్ష నిర్వహిస్తున్న దృశ్యం

గుంతకల్లుటౌన్: పారిశుధ్య కార్మికులు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్.భవాని, వైస్ చైర్‌పర్సన్లు నైరుతి రెడ్డి, మైమూన్ సూచించారు. స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా మంగళవారం లయన్స్, హర్‌కైండ్ క్లబ్ ఆధ్వర్యంలో ఆప్తాలమిక్ ఆఫీసర్ జి.దినేష్ 152 మంది పీహెచ్ వర్కర్లకు ఉచితంగా కంటి, షుగర్ నిర్ధారణ వైద్యపరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున, లయన్స్ క్లబ్ జోనల్ అధ్యక్షురాలు డాక్టర్ రేణుక, హర్‌కైండ్ క్లబ్ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు కె.జ్యోతి, ఇల్లూరి అరుణ, కోశాధికారి పద్మజ, మెప్మా టీపీఆర్ఓ మోహన్, సీఎంఎం భవానీ, సీఓలు, పీహెచ్ వర్కర్లు పాల్గొన్నారు.

రైతు సమస్యలు పరిష్కరించాలి

గుంతకల్లు రూరల్: రైతుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సీపీఐ, సీపీఎంఎల్ న్యూ డెమోక్రసీ, టీడీపీ నాయకులు ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ గుంతకల్లు మండలాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించాలని, వర్షాభావం కారణంగా నష్టపోయిన ప్రతి రైతుకూ పరిహారం అందజేయాలని, పాత రుణాలు రద్దు చేసి కొత్త రుణాలు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక


హ్యాండ్ బాల్‌లో రాష్ట్ర స్థాయికి ఎంపికైన విద్యార్థినులను అభినందిస్తున్న దృశ్యం

గుత్తి: పట్టణంలోని జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన అభివర్షిత(8వ తరగతి) అండర్ –14, జయశ్రీ (10వ తరగతి) అండర్–17 లో హ్యాండ్ బాల్ లో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ నెల 25న అనంతపురం ఆర్ట్స్ కాలేజీలో జరిగిన స్కూల్ గేమ్స్‌లో వారు ప్రతిభ కనబరిచారు. త్వరలో తెనాలిలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో వారు పాల్గొంటారు. కాగా పాఠశాలలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర స్థాయికి ఎంపికైన అభివర్షిత, జయశ్రీ ని హెచ్‌ఎం ఉషారాణి, పీడీలు సరోజ, శ్యామల అభినందించారు.

ఫ్యాక్టరీ ఏర్పాటుకు అభిప్రాయ సేకరణ


ప్రజాభిప్రాయ సేకరణ చేస్తున్న ఆర్డీఓ రవీంద్ర, ఎంఆర్ఓ మహబూబ్ బాషా

గుత్తి: మండలంలోని ఎంగిలి బండ పొలం సర్వే నంబర్ 142లో ఉన్న 4.600 హెక్టార్ల విస్తీర్ణంలో కంకర ఫ్యాక్టరీ (మైనింగ్ ఫ్యాక్టరీ) ఏర్పాటుకు అధికారులు మంగళవారం జక్కల చెరువు గ్రామ శివారులో ప్రజాభిప్రాయ సేకరణ చేశారు. గుంతకల్లు ఆర్డీఓ రవీంద్ర, గుత్తి తహసీల్దార్ మహబూబ్ బాషా ప్రజలతో మాట్లాడారు. స్థానికులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని, వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేయాలని జక్కల చెరువు, ఎంగిలి బండ గ్రామస్తులు కోరారు. అందుకు అధికారులు సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో ఆర్ఐ సందీప్, వీఆర్వో బాల రాజు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆయుష్ మేళా

పామిడి: పట్టణ భవిత కేంద్రంలో మెప్మా, ఆయూష్ ఆసుపత్రి ఆధ్వర్యంలో కేంద్రప్రభుత్వం ప్రారంభించిన ఆయుష్ మేళా–ఆయుష్ మాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయుష్ వైద్యురాలు కృష్ణవేణి డ్వాక్రా మహిళలకు ఆరోగ్య పరీక్షలతో పాటు మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మెప్మా టీఎంసీ చంద్రశేఖర్, యోగా శిక్షకురాలు సంధ్యారాణి, డ్వాక్రా మహిళలుపాల్గొన్నారు.

హాస్టళ్లను తనిఖీ చేసిన జడ్జి


విద్యార్థులతో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి దీనా

అనంతపురం: ఆదిమూర్తి నగర్‌లోని సాంఘిక సంక్షేమ బాలికల హాస్టల్, బీసీ హాస్టల్, ఎస్సీ హాస్టళ్లను అనంతపురం ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి దీన మంగళవారం సందర్శించారు. ఆహార నాణ్యత, పరిశుభ్రతపై ఆరా తీశారు. సమస్యలు ఉన్నాయా? అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు.

'మాస్టర్ ప్లాన్'కు నిధులు మంజూరు చేయండి

గుంతకల్లు రూరల్: ప్రముఖ పుణ్యక్షేత్రం కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానం మాస్టర్ ప్లాన్ అమలుకు నిధులు మంజూరు చేయాలని కోరుతూ ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి దేవదాయ శాఖ మంత్రికి విన్నవించారు. అసెంబ్లీ సమావేశాల సందర్భంగా మంగళవారం ఆలయ పాలకమండలి సభ్యుడు లోకనాథ్ శర్మతో కలసి దేవదాయ శాఖ మంత్రిని కలసిన ఎమ్మెల్యే మాస్టర్ ప్లాన్ అమలుకు నిధులు మంజూరు చేయాలని కోరారు. మాస్టర్ ప్లాన్ అమలులో భాగంగా మొదటి విడత కింద నిధుల మంజూరుకు తగిన ప్రతిపాదనలను ఆర్థిక శాఖకు పంపామని, త్వరలోనే నిధులు మంజూరవుతాయని దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ తెలిపినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

'జగనన్న గృహం' కోసం దరఖాస్తు చేసుకోండి

యాడికి: ఇళ్లు లేని నిరుపేదలు జగనన్న గృహం కోసం సచివాలయంలో దరఖాస్తు చేసుకోవాలని మండల హౌసింగ్ ఏఈ ప్రశాంత్ కుమార్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. గ్రామం కంఠంలో సొంత స్థలం ఉన్న వారు, పాడు బడిన ఇళ్ల వారు, పట్టా స్థలం ఉన్న వారు తగిన ధ్రువ పత్రాలతో ఆయా గ్రామాల్లోని సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని ప్రశాంత్ కుమార్ తెలిపారు.

నార్పలలో 65.2 మి.మీ వర్షపాతం

శింగనమల: నియోజకవర్గంలోని నార్పలలో సోమవారం రాత్రి 65.2 మి.మీ వర్షం కురిసింది. యల్లనూరు మండలంలో 48.8 మి.మీ, శింగనమల మండలంలో 21.8 మి.మీ, బుక్కరాయసముద్రం మండలంలో 21.4 మి.మీ, గార్లదిన్నె మండలంలో 17.2 మి.మీ, పుట్లూరు మండలంలో 17.0 మి.మీ వర్షం కురిసిందని రెవెన్యూ అధికారులు తెలిపారు.

30న మహాసభలను జయప్రదం చేయండి

గుంతకల్లు రూరల్: బీహార్‌లో జరిగే ఏఐఎస్ఎఫ్ 30వ జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని నియోజకవర్గ అధ్యక్షుడు వేణుగోపాల్ కోరాడు. ఏఐఎస్ఎఫ్ నాయకుల ఆధ్వర్యంలో స్థానిక బీటీ పక్కీరప్ప భవన్ నుంచి పొట్టి శ్రీరాములు సర్కిల్ వరకూ బైకు ర్యాలీ నిర్వహించారు.

యువతి అదృశ్యం


అదృశ్యమైన రమ్యశ్రీ

గుంతకల్లుటౌన్: పట్టణంలోని రాజీవ్‌కాలనీకి చెందిన టి.శ్రీనివాసులు కుమార్తె రమ్యశ్రీ అదృశ్యమైనట్లు వన్‌టౌన్ సీఐ రామసుబ్బయ్య తెలిపారు. పోలీసు కథనం మేరకు.. సోమవారం సాయంత్రం రమ్యశ్రీ వజ్రకరూరులో ఉన్న తన స్నేహితురాలి ఇంటికి వెళ్లొస్తానని బయల్దేరింది. రాత్రైనా ఇంటికి రాకపోవడంతో ఆమె ఆచూకీ కోసం కుటుంబసభ్యులు గాలించారు. మంగళవారం యువతి తండ్రి ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వెల్లడించారు.

సచివాలయ కార్యదర్శులకు షోకాజ్ నోటీసులు

గుత్తి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన భూముల రీసర్వే కార్యక్రమాన్ని సకాలంలో పూర్తి చేయకుండా నిర్లక్ష్యం వహించిన ఆరుగురు సచివాలయ కార్యదర్శులకు మంగళవారం మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. షోకాజ్ నోటీలకు సరియైన సమాధానం ఇవ్వకపోతే సస్పెండ్ చేస్తామని సచివాలయ కార్యదర్శులు మమత, వెంకట కృష్ణ, కౌశిక్, కామాక్షమ్మ, వినయ్‌కుమార్, రెడ్డప్పను కమిషనర్ హెచ్చరించారు.

ఇసుక ట్రాక్టర్ల సీజ్


స్వాధీనం చేసుకున్న ఇసుక ట్రాక్టర్లు

యాడికి: మండలంలోని రాయలచెరువులో గల చందన గేట్ సమీపంలో ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్న రెండు ట్రాక్టర్లను ఎస్ఈబీ అధికారులు మంగళవారం సీజ్ చేశారు. పెద్దపప్పూరు మండలం పెద్ద ఎక్కలూరు గ్రామానికి చెందిన రామ్మోహన్ రెడ్డి కుమారుడు హేమంత్ రెడ్డి(25), నారాయణ స్వామి కుమారుడు వినోద్ (23) అనే ఇద్దరు పెన్నానదిలో ఇసుకను తవ్వేసి రెండు ట్రాక్టర్లలో నకిలీ బిల్లులతో తరలిస్తున్నారనే సమాచారం అందడంతో ఎస్ఈబీ సిబ్బంది దాడి చేశారు. రెండు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకొని సీజ్ చేసి యాడికి పోలీసులకు అప్పగించారు. దాడిలో ఎస్ఈబీ సీఐ వరలక్ష్మీ, సిబ్బంది పాల్గొన్నారు.